క్లుప్తంగా

చీమకుర్తి మున్సిపాలిటీ మేనేజర్‌గా రాజు


కే రాజు

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీ మేనేజర్‌గా కే రాజు నియమితులయ్యారు. ఆ మేరకు సోమవారం ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు విడుదల చేసింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి చీమకుర్తికి బదిలీపై ఆయన వచ్చారు.

ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయాలి

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం మిగులు నిధులు, పల్లెపండుగ పనులకు సంబంధించిన నిధులు తక్షణమే విడుదల చేయాలని సర్పంచుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘంతో చేపట్టిన పనులు, పల్లెపండుగలో చేపట్టిన పనులకు చెందిన నిధులు విడుదల చేయాలన్నారు. ఏడాది పూర్తి చేసుకున్న ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థలో అనుకున్నంత, ఆశించినంత మార్పునకు చేరుకోలేకపోయిందని విమర్శించారు. కనీసం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు గౌరవ వేతనాన్ని ఇచ్చిన మాట మేరకు పెంచకపోగా, బకాయిలు చెల్లించలేదని విమర్శించారు.

ప్రైవేటు స్కూళ్లకే షైనింగ్ స్టార్ అవార్డులు

- చీమకుర్తి మండలానికి ఏడు అవార్డులిస్తే ప్రభుత్వ పాఠశాలలకు ఒక్కటీ రాని పరిస్థితి

చీమకుర్తి: షైనింగ్ స్టార్ పేరుతో ప్రభుత్వం అందిస్తున్న ప్రతిభ అవార్డులు చీమకుర్తి మండలంలో ప్రైవేటు పాఠశాలలకే దక్కాయి. ప్రభుత్వ పాఠశాలలకు ఒక్కటి కూడా రాకపోవడంతో ప్రతిభ అవార్డులు కాస్తా కార్పొరేట్ అవార్డులుగా మారాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన ప్రతిభ అవార్డులలో చీమకుర్తి మండలానికి 7 అవార్డులు వచ్చాయి. ఒక్కో అవార్డు కింద రూ.20 వేల నగదు, ప్రశంసపత్రం కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. చీమకుర్తి మండలం నుంచి అవార్డును అందుకున్న ప్రైవేటు పాఠశాలల్లో శ్రీచైతన్య హైస్కూలు నుంచి నలుగురు విద్యార్థులు ఏల్చూరి అభిరుత్విక్, శీలం వెంకట కృష్ణ మనోహర్, బుక్కసముద్రం వీర ఉమారెడ్డి, రౌతు తేజో వర్షిత, విద్యానికేతన్ హైస్కూలు నుంచి బల్లికూర తేజశ్వి, చీమకుర్తి పబ్లిక్ హైస్కూలు నుంచి పీ బాలనాగేంద్ర, ఎస్‌కేఆర్ స్పెషల్ స్కూలు నుంచి మన్నం జోషాహిత ఉన్నారు. వీరిని ఆయా పాఠశాలల యాజమాన్యాలతో పాటు వారి తల్లిదండ్రులు అభినందించారు.

బిర్సా ముండాకు ఘన నివాళి

ఒంగోలు సబర్బన్: గిరిజన నాయకుడు బిర్సా ముండాకు బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు రూరల్ మండలం కరవదిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గె శ్రీనివాసరావు పాల్గొని బిర్సా ముండా సేవలను కొనియాడారు. బ్రిటీష్ పరిపాలనను వ్యతిరేకించి వారిపై తిరుగుబాటు చేసిన నాయకుడు బిర్సా ముండా అని అన్నారు. బిర్సాను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన సందర్భంలో ఆ జైల్లోనే చనిపోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాకినేని అమరసింహం, కొమరగిరి వెంకటలక్ష్మి, నంబూరి రమేష్, మేకల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలి

ఒంగోలు సబర్బన్: మీ కోసం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ.బి.చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టరు పార్థసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మోడల్ పాఠశాల విద్యార్థులు ఆరుగురికి షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులు లభించాయి. వారందరికీ ఒంగోలులోని శ్రీ సాయిబాబా సెంట్రల్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా రూ.20,000 నగదు, సర్టిఫికెట్, మెడల్‌ను సోమవారం అందజేశారు. వారిలో బీ కీర్తన, పీ అశ్విని, కే బాలకృష్ణ, జి.గాయత్రి, కే ధనుష్, పి.జయత్ నాయక్ ఉన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు అభినందించారు.

కురిచేడు కేజీబీవీ విద్యార్థినికి...

కురిచేడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో చదువుతున్న మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్థిని షేక్.నాషియాకు షైనింగ్ స్టార్ అవార్డు లభించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి తెలిపారు. సోమవారం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా రూ.20,000 నగదు, సర్టిఫికెటు, మెడల్ అందుకున్న నాషియాను ప్రిన్సిపాల్ పద్మావతి, బోధనా సిబ్బంది అభినందించారు.

జగనన్న పొదిలి పర్యటనను

విజయవంతం చేయాలి



ఒంగోలులో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పిలుపు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11వ తేదీ పొదిలి రానున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ పొగాకు రైతులకు అండగా ఉండేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వస్తున్నారని, పార్టీ శ్రేణులు, రైతులంతా తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో రైతుల బాధలు చెప్పలేనివిధంగా ఉన్నాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక విలవిల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలబడేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనకు భారీగా రైతులు, నాయకులు, మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్ కుమార్, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు 11న పొదిలి తరలిరావాలి

- పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పిలుపు

సంతనూతలపాడు: పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11వ తేదీ పొదిలిలోని పొగాకు బోర్డును సందర్శించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ శ్రేణులు, రైతులకు పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పిలుపునిచ్చారు. సంతనూతలపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారని తెలిపారు. గిట్టుబాటు ధరల కోసం వ్యాపారులపై ఒత్తిడి తెచ్చే విధంగా పోరాటం చేసేందుకు జగనన్న పోరుబాటకు శ్రీకారం చుట్టారని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా పొగాకు రైతులు పొదిలి తరలిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనాలని కోరారు.

రైతులను చిన్నచూపు చూస్తున్న చంద్రబాబు...

మాయమాటలు, అబద్ధాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను చిన్నచూపు చూస్తున్నారని దుంపా చెంచిరెడ్డి మండిపడ్డారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేస్తే.. వ్యవసాయం దండగనే రీతిలో చంద్రబాబు పాలన ఉంటోందని విమర్శించారు. గతేడాది పొగాకును క్వింటా రూ.36,000కు కొనుగోలు చేయగా, ప్రస్తుతం రూ.24,000కు కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. రానున్న రోజుల్లో ధరలు ఇంకా తగ్గే ప్రమాదముందన్నారు. రైతులకు మేలు చేయాలనే ఆలోచనే టుబాకో బోర్డుకు, రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రానికి వెన్నెముకలాంటి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. దళారులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఈ క్రాప్ చేయించి ప్రభుత్వమే బీమా నగదు చెల్లించి రైతులను ఆదుకున్న విషయాన్ని చెంచిరెడ్డి గుర్తు చేశారు. పంట నష్టం జరిగితే వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారని చెప్పారు. పొగాకు రైతులు గిట్టుబాటు ధర లభించక అవస్థపడుతుంటే రూ.100 కోట్లు కేటాయించి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి వైఎస్ జగన్ ఆదుకున్నారని దుంపా చెంచిరెడ్డి గుర్తుచేశారు. ఆనాడు క్వింటా పొగాకును రూ.34,000 నుంచి రూ.35,000 మధ్య కొనుగోలు చేయడంతో పొగాకు రైతులు బాగుపడ్డారని తెలిపారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని జగన్ నమ్మారన్నారు. ప్రస్తుతం పంటలకు మద్దతు ధర లభించక రైతాంగం కుదేలవుతున్నా నేటి ప్రభుత్వం, సీఎం పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు.. ఏదైనా సరే బహిరంగ మార్కెట్లో అధిక ధరలు ఉన్నాయని, రైతుకు మాత్రం గిట్టుబాటు ధర కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు రైతు కష్టాన్ని దోచేస్తుంటే కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఫలితంగా పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మాత్రమే అండగా ఉంటోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులను పట్టించుకోడన్నారు. వెంటనే రైతులను ఆదుకోవాలని, లేకుంటే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి పొగాకు రైతులంతా ఈ నెల 11వ తేదీ పొదిలిలో వైఎస్ జగన్ పర్యటనకు హాజరై విజయవంతం చేయాలని చెంచిరెడ్డి కోరారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, ఎంపీపీ విజయ, నాయకులు సన్నపురెడ్డి రమణమ్మ, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, పక్కన నాయకులు

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలు ఎంపిక


కమిటీలకు ఎంపికైన వారికి పార్టీ కండువాలు కప్పి అభినందిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు నూతనంగా గ్రామ కమిటీలను ఎన్నుకుంటున్నట్లు పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తకోట, తక్కెళ్లపాడు, ముప్పాళ్ల మద్దిరాల గ్రామ కమిటీల ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొని కమిటీలు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా గ్రామ కమిటీలకు ఎంపికైన అధ్యక్షులు, కమిటీ సభ్యులకు మేరుగు నాగార్జున పార్టీ కండువాలు వేసి అభినందించారు. కమిటీ ఎంపికలో పార్టీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, పోలినేని కోటేశ్వరరావు, పాలడుగు రాజీవ్, చిన్నం సురేష్, కాకర్ల వెంకటేష్, జెట్టి శ్రీనివాసరావు, తగిరస సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల మద్దిరాల గ్రామ కమిటీ...

అధ్యక్షునిగా మండవ సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా పోకూరి సత్యనారాయణ, పెదపూడి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా చిన్నం చంద్రయ్య, కరణం శ్రీధర్‌బాబు, కార్యదర్శులుగా సారెకుక్క ఉదయ్ ప్రకాష్, తిమోతి, పులిపాటి అనీల్, బత్తుల రాముడు, బూత్ కమిటీ అధ్యక్షులుగా పెదపూడి అశోక్, తగిరిశ హరికృష్ణ, ఎస్సీ సెల్ గ్రామాధ్యక్షునిగా బెజ్జం నాగేశ్వరరావు, యూత్ గ్రామాధ్యక్షునిగా నక్కా కోటిబాబు, మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కొత్తకోట గ్రామ కమిటీ...

అధ్యక్షునిగా చిన్నం సురేష్, ఉపాధ్యక్షులుగా మెలతోటి సుధాకర్, మెరతోటి అశోక్‌బాబు, ప్రధాన కార్యదరుర్శులుగా గుంజి అంకమ్మ, పల్లపు సానీరావు, మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

తక్కెళ్లపాడు గ్రామ కమిటీ...

అధ్యక్షునిగా గాలి యేసుపాదం, ఉపాధ్యక్షులుగా గాలి భాస్కర్‌రావు, రంపతోటి నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా కొప్పుల నాగార్జున, వై.అశోక్, మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

షూటింగ్‌లో క్విస్ విద్యార్థుల ప్రతిభ

- అండర్ – 16లో ముగ్గురికి, అండర్ – 21లో ఒకరికి పతకాలు
- అభినందించిన యాజమాన్యం


గెలుపొందిన విద్యార్థిని అభినందిస్తున్న క్విస్ కళాశాల యాజమాన్యం

ఒంగోలు సిటీ: ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, క్విస్ హైస్కూల్ విద్యార్థులు రైఫిల్ షూటింగ్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచారు. రైఫిల్ ఇండియా ప్రకాశం జిల్లా వారు నిర్వహించిన పదిమీటర్ల ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టోల్ షూటింగ్‌లో సత్తాచాటారు. అండర్ – 16లో క్విస్ హైస్కూల్‌కు చెందిన ఎస్.రీష్మ సాయి భ్రమర రెండో స్థానం కైవసం చేసుకోగా, వి.నాగరిషిత మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. బాలుర కేటగిరిలో బి.అవినాష్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచాడు. ఇదే పోటీల్లో అండర్ 21 – కేటగిరిలో క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న సురేందర్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. వీరికి ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా పతకాలు, ప్రశంసపత్రాలు అందజేశారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వీరంతా రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి అభినందించారు. క్విస్ విద్యాసంస్థల్లో చదువుతో పాటు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ లాంటి వాటికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, క్విస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కమలేశ్వరి, హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ హిమబిందు, ఎస్‌సీసీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత


నాగులుప్పలపాడులో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది


చీమకుర్తిలో యోగాంధ్ర గురించి వివరిస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య

నాగులుప్పలపాడు: యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ దక్షిణామూర్తి అన్నారు. ఈ నెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ నాగులుప్పలపాడులో సోమవారం మాస్ ర్యాలీ నిర్వహించారు. యోగా చేయడం వలన కలిగే ఉపయోగాలు, యోగా ఆవశ్యకత, యోగా దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. ర్యాలీలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ రవి, ఏపీఓ రవిబాబు, ఏపీఎం నరేంద్రకుమార్, పోలీస్ సిబ్బంది, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మద్దిపాడు సెంటర్లో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

చీమకుర్తిలో...

చీమకుర్తి: యోగాంధ్ర కార్యక్రమంపై చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య సోమవారం సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. మున్సిపాలిటీలోని సచివాలయాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ర్యాలీ నిర్వహణ

మద్దిపాడు: మద్దిపాడులో సోమవారం ఉదయం ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్ యోగాంధ్ర ర్యాలీ, స్థానిక సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో ఈ నెల 1 నుంచి 21వ తేదీ వరకు యోగా చేయాలని సూచించిన నేపథ్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, వైద్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకునికి నివాళులు


మోషేకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి రూరల్: మండలంలోని తొర్రగుడిపాడు క్రిస్టియన్‌పాలెంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సాపాటి మోషే (53) సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా, చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వరు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, ఏలూరి సురేష్, తెల్లమేకల వెంకటేశ్వర్లు, పిచ్చిరాజు, స్థానిక నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మద్దిపాడు ఏఎంసీ డైరెక్టర్‌గా మూడు పర్యాయాలు పనిచేసి మోషే అందించిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ పోరాటం


ఎస్టీయూ పతకాన్ని ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య, నాయకులు

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ అలుపెరుగని పోరాటం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు కే ఎర్రయ్య అన్నారు. ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎస్టీయూ ఉద్యమ పతాకాన్ని ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎర్రయ్య మాట్లాడుతూ 1947 జూన్ 9న నిజాం ప్రభుత్వ కాలంలో ప్రముఖ తెలంగాణ కవి మగ్దూమ్ మహాయుద్దీన్ నాయకత్వంలో ఎస్టీయూ ఆవిర్భవించిందని, అప్పటి నుంచి అనేక పోరాటాలు చేస్తోందని తెలిపారు. అప్రంటీస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 70 రోజులపాటు నిరాహార దీక్షలు చేసి ఆ హక్కు సాధించుకుందన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై అనేక రాజీలేని పోరాటాలు చేసిన ఏకైక ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ అని అన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, మాజీ ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదినారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ కడియాల ప్రసాద్, ఉపాధ్యాయవాణి కన్వీనర్ పి.అత్తయ్య, ఒంగోలు టౌన్ అధ్యక్షుడు మాధవరావు, కొనకనమెట్ల అధ్యక్షుడు అల్లడి బాబూరావు, చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రావణబ్రహ్మ వాహనంపై రాజరాజేశ్వరస్వామి


రావణబ్రహ్మ వాహనంపై గంగాపార్వతీ సమేత శ్రీ రాజరాజేశ్వరస్వామి


ఊరేగింపులో కళాకారుల ప్రదర్శనలు

ఒంగోలు మెట్రో: స్థానిక తూర్పుపాలెం శివాలయం కొత్తపట్నం బస్టాండ్ సర్కిల్ వద్ద వెలసిన శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం గణపతి పూజ, స్వామివారికి రుద్రాభిషేకం, సాయంత్రం ఆరు గంటలకు పార్వతీదేవి అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి ఏడు గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రావణబ్రహ్మ వాహనంపై ప్రత్యేక అలంకరణలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, తప్పెట్లతో శివపార్వతుల వేషధారణలో కళాకారులు నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రావణబ్రహ్మ వాహనంపై స్వామివారిని దర్శనం చేసుకున్న నగర ప్రజలు మంగళహారతులిచ్చి ఆశీసులు అందుకున్నారు. నగరోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.